
సాక్షి పల్నాడు

మంగళవారం, 15, ఏప్రిల్, 2025



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి గుడి పునర్నిర్మాణానికి చిలకలూరిపేటకు చెందిన తోట రవికుమార్, సునీత దంపతులు రూ.1,01,116 విరాళంగా అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు నీటిని నిలుపుదల చేశారు.

ఆంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మాచవరం గ్రామంలోని నల్లంత ఆంజనేయ స్వామి తిరునాళ్లను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

వక్ఫ్ సవరణ చట్టం రద్దు కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన



నరసరావుపేట: భారత రాజ్యాంగం కాపాడాలని, వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం పట్టణంలోని గడియార స్తంభం వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత, పేద మధ్యతరగతి ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లిం సంఘాలు, సీపీఎం, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ముస్లిం మైనార్టీ నాయకులు మస్తాన్‌వలి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముస్లింల అణచివేతకు పాల్పడుతుందన్నారు. ఒక్క ముస్లింను కూడా కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గంలో నియమించలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఎం నాయకులు డి.శివకుమారి, పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, అమరావతి రజక ఐక్యవేదిక నాయకులు ఉదయగిరి వెంకటస్వామి, మైనారిటీ నాయకులు మాదిన రసూల్ రఫీ, వర్లమాబు, కరీముల్లా, ఖలీల్, మెకానిక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ




నరసరావుపేటటౌన్: జాగ్రత్తలు పాటించటంతో అగ్ని ప్రమాదాలు అరికట్టవచ్చని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో గతేడాది 530 ప్రమాదాలు చోటుచేసుకోగా రూ.6.62 కోట్లు ఆస్తి నష్టం జరిగిందన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సకాలంలో స్పందించి రూ.22.57 కోట్ల విలువైన ఆస్తిని కాపాడన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, బహుళ అంతస్తుల భవనాలు, ఆసుపత్రులు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంలు, రద్దీ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట అగ్నిమాపక శాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గోవర్ధనస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



నాదెండ్ల: నాదెండ్లలో కొలువై ఉన్న చారిత్రాత్మక ఆలయమైన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ గోవర్ధనస్వామి, భూనీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి వార్ల దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు స్వామివారి ధ్వజారోహణ నిర్వహించారు. ఈ నెల 8న ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్లకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం సాయిశ్రీనివాసాచార్యులు, విజయరామాచార్యులు, సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమాలను ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాదాయశాఖ ఈవో శ్రీనివాసు పర్యవేక్షించారు.

గంజాయి అమ్మకాలపై నిఘా ఉంచాలి



నెహ్రూనగర్: ప్రభుత్వం తలపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 28 గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాస్ తెలియజేశారు. సోమవారం బ్రాడీపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖకు సంబంధించిన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టి పట్టణ, మున్సిపల్ ప్రాంతాల్లో అమ్మకాలపై కేసులు నమోదు చేయాలన్నారు.

పాలకుల పాపం

- వర్గపోరుతో సతమతం
- బీసీ, ఎస్సీలంటే చిన్నచూపు
- బలహీనవర్గాలైతే సస్పెన్షన్
- అధికారపార్టీ సామాజికవర్గమైతే వీఆర్‌తో సరి!
- వివక్షపై మండిపడుతున్న పోలీసు సిబ్బంది
- బోరుగడ్డ అనిల్, గోరంట్ల మాధవ్ కేసుల్లో బలి చేసింది బలహీనవర్గాలనే!

పోలీసు శాఖకు శాపం



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పాలకుల పాపం పోలీసు శాఖకు శాపంగా మారుతోంది. రాజు గారి బిడ్డను ఎత్తుకున్నా తప్పే... దింపినా తప్పే అనే చందాన గుంటూరు రేంజ్ ఐజీ వ్యవహారం తయారైంది. ఏదైనా ఘటన జరిగినప్పుడు తెలుగుదేశం పార్టీ సామాజికవర్గం వారైతే వీఆర్‌కు పిలవడం, తర్వాత పోస్టింగ్ ఇవ్వడం.. అదే బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలైతే సస్పెన్షన్‌కు గురి చేయడం రేంజ్‌లో చర్చనీయాంశంగా మారింది. రెండురోజుల క్రితం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అరెస్టు చేసినప్పుడు తన లాయర్‌తో ఫోన్‌లో మాట్లాడారన్న సాకుతో ఒక బీసీ వర్గానికి చెందిన సీఐతోపాటు బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన ఎస్ఐలు, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. అదే సమయంలో అక్కడే ఉన్న కూటమి సామాజికవర్గం సీఐపై చర్యలు తీసుకోకపోవడాన్ని సిబ్బంది ఎత్తిచూపుతున్నారు.

ఇటీవల పెరిగిన సస్పెన్షన్లు

చిన్నాచితక వ్యవహారాలకు కూడా ఎటువంటి సమాచారం లేకుండా, వివరణ తీసుకోకుండా సస్పెన్షన్ వేటు వేయడం ఇటీవల గుంటూరు రేంజ్ పరిధిలో ట్రెండ్‌గా మారిందనే వాదన వినిపిస్తోంది. ఇటీవల అరెస్టు చేసిన గోరంట్ల మాధవ్‌ను వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లిన సమయంలో కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, అరండల్‌పేట సీఐ వీరాస్వామి, పట్టాభిపురం ఎస్సై రాంబాబు, నగరంపాలెం ఎస్సై ఆంజనేయులతోపాటు ఏఆర్ పోలీసులు, సిబ్బంది బందోబస్తుగా వెళ్లారు. అయితే వైద్య పరీక్షల సమయంలో లాయర్‌తో మాట్లాడేందుకు మాధవ్ తన అనుచరుల వద్ద ఫోన్ తీసుకుని మాట్లాడుతుండగా ఈ విషయాన్ని గుర్తించిన అరండల్‌పేట సీఐ వీరాస్వామి దానిని లాక్కున్నారు. అయితే ఫోన్ మాట్లాడే వరకు ఎందుకు ఊరుకున్నారనే సాకుతో ఈ వ్యవహారంలో ఎస్సీ, బీసీలు అయిన అరండల్‌పేట సీఐ వీరాస్వామితోపాటు ఎస్సై రాంబాబు, ఎస్సై ఆంజనేయులు, మరో తొమ్మిది మంది కిందిస్థాయి సిబ్బందిని సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే అక్కడే మౌనంగా ఉన్న కొత్తపేట సీఐ వీరయ్య చౌదరిపై మాత్రం ఏ చర్యలూ తీసుకోలేదు. దీనిపై పోలీసు శాఖలో విస్మయం వ్యక్తమవుతోంది. ఇటీవల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్యనూ వీఆర్‌కు పంపడం చర్చకు దారితీసింది. సీతారామయ్య బాధ్యతలు తీసుకున్న దగ్గర నుంచి ఆయనను సాగనంపేందుకు అధికారపార్టీ సామాజికవర్గానికి చెందిన సీఐలు, ఎల్లో మీడియా చేయని యత్నాలు లేవని తెలుస్తోంది.

బీసీ ఎస్సీలే సమిధలు..!

పోలీసు శాఖలో బీసీలు, ఎస్సీలే సమిధలవుతున్నారు. గతంలోనూ బీసీ, ఎస్సీ పోలీసు అధికారులపై పోలీసు ఉన్నతాధికారులు వేటు వేశారు. నాలుగు నెలలక్రితం పశ్చిమ ఎమ్మెల్యే కోపంగా ఉన్నారంటూ ఎల్లో మీడియాలో వార్త రాగానే నగరంపాలెం సీఐ వీరానాయక్‌ను వీఆర్‌కు పిలిచారు. పట్టాభిపురం స్టేషన్‌కు పోస్టింగ్ వచ్చిన 24 గంటల్లోనే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మధుసూదనరావును వీఆర్‌కు పిలిచి అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన గంగా వెంకటేశ్వర్లుకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే చిన్న విషయాన్ని సాకుగా చూపి డీసీఆర్‌బీ సీఐ బిలాలుద్దీన్‌ను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే రేంజ్ పరిధిలోని రాపూరు స్టేషన్ అధికారిపై ఆరోపణలు వచ్చినా అధికార పార్టీ సామాజిక వర్గం కావడంతో చర్యలు తీసుకోకుండా వీఆర్‌కు పిలిచి ఊరుకున్నారు. అధికారపార్టీ అనుకూలురు అయితే ఒకలా.. మరో వర్గం వారైతే మరోలా పోలీసుశాఖ ఉన్నతాధికారులు వ్యవహరించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే..!

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పోలీసు శాఖ ఒక వర్గానికి కొమ్ముకాస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఐజీ కూడా అధికార పార్టీకి వంతపాడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరుకు చెందిన బోరుగడ్డ అనిల్‌కు పోలీసుస్టేషన్‌లో రాచమర్యాదలు చేశారన్న విషయంలోనూ బీసీ, ఎస్సీ, మైనారిటీ సిబ్బందిపైనే సస్పెన్షన్ వేటు వేశారు. అప్పట్లో అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన సీఐ కుంకా శ్రీనివాసరావును వీఆర్‌కు పిలిచి కొద్ది కాలానికి కీలకమైన రాజధాని ప్రాంతానికి సీఐగా బదిలీ చేశారు. అదే సమయంలో సస్పెండ్ అయిన వారిపై సస్పెన్షన్ ఎత్తివేయలేదు. ఈ నేపథ్యంలో మనోవ్యథతో మైనారిటీ వర్గానికి చెందిన ఒక కానిస్టేబుల్ మృతి చెందారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

నివాళులు అర్పించిన కలెక్టర్, ఎమ్మెల్సీ జంగా, ప్రభుత్వ విప్ జీవీ, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ తన జీవితాన్ని పణంగా పెట్టి ఎదిగిన వ్యక్తి అని, వారి జీవితం, చరిత్ర స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కొనియాడారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రతి విద్యార్థి చదువుకోవాలన్నారు. భారతీయులందరూ స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవనం గడపడానికి ఒకే కారణం రాజ్యాంగమేనన్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీకి త్వరలోనే కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళ వసతి గృహాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సివిల్ పనులకు సంబంధించి నిధులు అందాయని తెలిపారు. రాబోయే రోజులలో జిల్లా అధికారులు నెలలో ఒకరోజు సంక్షేమ వసతి గృహాలలో పర్యటించి విద్యార్థిని విద్యార్థులతో కలిసిమెలిసి వారి సాధక బాధలు తెలుసుకొని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి నాలుగో శనివారం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. యూపీఎస్‌ఎస్‌సీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న విధంగానే ఏపీపీఎస్సీ పరీక్షలకు హాజరవుతున్న వారికి కూడా ఉచిత శిక్షణ ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ విభిన్న కులాలు, జాతులు కలిగిన దేశం భిన్నత్వంలో ఏకత్వం ఉన్న అతి పెద్ద ప్రజాస్వామిక దేశం మనది అన్నారు. ప్రభుత్వ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగ సృష్టికర్త, రాజ్యాంగవేత్త, సంఘ సంస్కర్త, జాతీయ ముద్దుబిడ్డ అని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమైందని కొనియాడారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ అంబేడ్కర్ పేరు వింటేనే ఒళ్లు పులకరిస్తుందన్నారు. ఆయన జీవిత చరిత్రను తెలుసుకొని ఆయన అంత గొప్ప వ్యక్తులు కావాలని విద్యార్థులకు సూచించారు. ప్రజలకు స్వేచ్ఛా జీవితాన్ని ఇచ్చే రాజ్యాంగం సృష్టికర్త కావడం గొప్ప విషయం అన్నారు. అంబేడ్కర్ జీవితచరిత్ర పుస్తకాన్ని జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి శివనాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. తొలుత పట్టణ నడిబొడ్డున ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు అరవిందబాబుతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి ర్యాలీలో పాల్గొన్నారు.

కడచూపునకు వస్తూ కడతేరే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- నానమ్మ మరణ వార్త విని వస్తుండగా దుర్ఘటన
- శోకసముద్రంలో మునిగిన కుటుంబం



మృతుడు మక్కెన శివరామకృష్ణ (ఫైల్)

యడ్లపాడు: నాయనమ్మ మరణించిందని తెలిసి కడచూపుకు వస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ హృదయ విదారక ఘటన యడ్లపాడు మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చిలకలూరిపేట పోలిరెడ్డిపాలెం ఎదురుగా ఉన్న లక్ష్మీనర్సింహకాలనీకి చెందిన మక్కెన శ్రీనివాసరావు దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో చిన్నవాడైన శివరామకృష్ణ(28)కి ఏడాదిన్నరక్రితం సమీప బంధువు నందినితో పెళ్లయింది. శివరామకృష్ణ విజయవాడలోనే ఉంటూ ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం చిలకలూరిపేట రూరల్ మండలం అప్పాపురం గ్రామంలో ఉన్న నాయనమ్మ సుబ్బులమ్మ చనిపోయిందన్న వార్త తెలిసి చూసేందుకు బైక్‌పై బయలుదేరాడు. యడ్లపాడు గ్రామంలోని ఎస్ఎస్ఎల్ నూలుమిల్లు వద్ద ఫ్లై ఓవర్ వద్దకు రాగానే ఎదురుగా వెళ్తున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో బైక్ అదుపు తప్పి ఆ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శివరామకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు శివరామకృష్ణను విజయవాడ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే సుబ్బులమ్మ భౌతికకాయాన్ని చూసేందుకు తరలివచ్చిన బంధుమిత్రులు సోమవారం ఉదయం ఆమెకు అప్పాపురం గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శివరామకృష్ణ భౌతికకాయానికి పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో అప్పాపురం వచ్చిన బంధుమిత్రులంతా చిలకలూరిపేట లక్ష్మీనర్సింహకాలనీకి తీసుకువచ్చిన శివరామకృష్ణ భౌతికకాయాన్ని సందర్శించి పట్టణంలోని ఏఎంజీ సమీపంలోని శ్మశాన వాటిలో ఖననం చేశారు. ఒకే కుటుంబంలోని ఇద్దరు వెనువెంటనే మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అకాల వర్షంతో
నేలవాలిన పంటలు

బల్లికురవ: ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికందే దశలో ఈదురుగాలుల వర్షం ధాటికి నేలవాలాయి. ఆదివారం సాయంత్రం మండలంలోని కొప్పరపాడు, వైదన, కొమ్మినేనివారిపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, ఎల్ఎల్‌గుడిపాడు, అంబడిపూడి, బల్లికురవ గ్రామాల్లో వర్షం, గాలి ప్రభావంతో కండె దశలో ఉన్న మొక్కజొన్న నేలావాలింది. ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టామని దిగుబడులు ఆశాజనకంగా ఉన్న పరిస్థితిలో నష్టాలు మిగిల్చాయని రైతులు వాపోయారు. పైగ్రామాల్లో సుమారు. 800 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపోయిన పంటలను పరిశీలించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



కొప్పరపాడులో నేలవాలిన మొక్కజొన్న

గాలివానతో నేలవాలిన మొక్కజొన్న

జే పంగులూరు: ఆదివారం సాయంత్రం మండలంలోని కొన్ని గ్రామాల్లో గాలితో కూడిన వర్షం పడటంతో మొక్కజొన్న రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని ఏఓ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం గాలివానతో నేలకొరిగిన మొక్కజొన్న పంటను, కారణంగా తడిచిన మొక్కజొన్నను ఏఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం, మంగళవారం, బుధవారాలు వరకు వాతావరణ శాఖ దక్షిణ కోస్తా జిల్లాలో గాలి, ఉరుములతో కూడిన వర్షం పడే సూచనలు ఉన్నాయని హెచ్చరికలు జారీ చేశారన్నారు. కల్లాలో ఉన్న పంటలను జాగ్రత్త పరుచుకోవాలని తెలిపారు. వీలైతే పంట కోతలు బుధవారం వరకు వాయిదా వేయాలని ఆయన సూచించారు.

బొప్పాయి, అరటి తోటలకు తీవ్ర నష్టం

అద్దంకి: గాలి వానకు సంతమాగులూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉద్యాన రైతుకు నష్టం కలిగింది. అద్దంకి మండలంలోని రామాయపాలెం, తిమ్మాయపాలెం, అద్దంకి, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల్లో పచ్చి ఇటుక వర్షానికి తడిసిపోయింది. ఇక సంతమాగులూరు మండలంలోని సంతమాగులూరు, మక్కెనవారిపాలెం గ్రామాల్లో సాగు చేసిన బొప్పాయి, అరటి తోటలు దెబ్బతిన్నాయి.



సంతమాగులూరులో నేలకొరిగిన అరటి తోట

సైబర్‌'తెగింపు'

వలలో పడ్డారో విలవిల..!!

- ఆన్‌లైన్‌లో వస్తువుల పేరుతో మోసం
- తెలియని లింకులు క్లిక్ చేస్తే చిక్కులే..
- డేటా కాజేసి.. దోచేసే అవకాశాలే అధికం..
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసు అధికారులు



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలోని బ్రాడీపేటకు చెందిన శ్వేత అనే యువతి ఇన్‌స్టాగామ్ చూస్తుంటారు. ఈ క్రమంలో ఆమె ఒక యాడ్‌ను చూసి తక్కువ ధరకే పలు వస్తువులు వస్తున్నాయన్న నేపథ్యంలో రూ.700 చెల్లించి బుక్ చేశారు. నాలుగు రోజుల తరువాత కొరియర్ వచ్చింది. కొరియర్ కవర్ ఓపెన్ చేసిన ఆమె షాక్‌కు గురయ్యారు. అందులో రెండు అట్టముక్కలు పెట్టి ఉన్నాయి. తిరిగి యాప్‌లోకి వెళ్ళి చూడగా, రిటర్న్ ఆప్షన్ లేదు.. కంపెనీ వెబ్‌సైట్ ఓపెన్ కాని పరిస్థితి.

– కొత్తపేటలోని గణేశ్వరరావు వీధికి చెందిన డి.ప్రసాద్ అనే వ్యక్తి ఒక ప్రధాన యాప్ ద్వారా ఆఫర్ ఉండటంతో ఆరు సూట్‌కేసులు బుక్ చేశారు. అయితే అందులో ఉన్న కంపెనీకి బదులుగా మరో కంపెనీ సూట్‌కేసులు వచ్చాయి. దీనిపై కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ఫలితం కనపడలేదు. ఆన్‌లైన్ వస్తువుల విక్రయాల్లోనూ జాగ్రత్తలు అవసమరని నిపుణులు చెబుతున్నారు. ఈ–మెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో యాడ్స్ రూపంలో ప్రకటనలు ఇస్తూ.. ప్రజలకు కొందరు టోకరా ఇస్తున్నారు. వీటితోపాటు వెబ్ లింక్‌ల ద్వారా సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. నగరంలో ఇటువంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయనే చెప్పాలి. చిన్నపాటి మొత్తాలు కావటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటం లేదు. అదే ఉద్యోగ మోసాలు, ఆన్‌లైన్‌లో సొమ్ములు పోయినవి అయితే అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. ఎస్ఎంఎస్ రూపంలో లింకులపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



బ్రాడీపేట యువతికి కొరియర్‌లో వచ్చిన అట్టముక్కలు

హలో అంటూ అందినకాడికి..

వేసవి నేపథ్యంలో మన ఇంట్లో ఉపయోగించే ఏసీ, ఫ్రిజ్, టీవీల వంటివి రిపేర్ అవుతుంటాయి. కస్టమర్ కేర్ నంబర్ కోసం నెట్‌లోకి వెళ్ళి వెతికే క్రమంలో అవే కంపెనీల పేరుతో ఫేక్‌కాల్స్ వచ్చే ప్రమాదం ఉంది. టెలీ కాలర్స్ మాట్లాడి మన వివరాలు తెలుసుకుని ఖాతాలు కొల్లగొట్టే ఆస్కారం ఉంది.

డేటా చోరీ

వాస్తవానికి పెద్దవిగా, గజిబిజి అక్షరాలతో ఉండే వెబ్‌లింక్‌లను షార్ట్ లింక్‌ల మాదిరిగా పంపే ఆప్షన్‌లు ఇప్పుడొచ్చేశాయి. దీనిని ఆసరాగా చేసుకుని సైబర్ కేటుగాళ్ళు షార్ట్ లింక్‌లను సెల్‌ఫోన్‌లలోని యాప్‌లకు పంపుతూ.. వాటిని క్లిక్ చేసి తరువాత పర్సనల్ డేటాను హ్యాక్ చేస్తున్నారు. ఈ–మెయిల్ ద్వారా వచ్చే లింక్ క్లిక్ చేస్తే ఫేక్ వెబ్‌సైట్ ఓపెన్ అయి.. తెలియక మన వివరాలన్నీ ఎంటర్ చేస్తాం. హ్యాకర్లు ఈ లింక్లతో మన సిస్టమ్‌ను వారి కంట్రోల్‌లోకి తీసుకుని క్రిప్టో మైనింగ్ ద్వారా డబ్బులు దోచేస్తున్న పరిస్థితులు ఉన్నాయి.

ఈ జాగ్రత్తలు అవసరం..

సెల్‌ఫోన్‌కు వచ్చే మేసేజ్‌లు, సామాజిక మాధ్యమాలకు వచ్చే లింక్‌లను జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. తెలియని లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. ఒకవేళ తెలియక క్లిక్ చేసినా డబ్బులు పంపించకూడదు. ఓటీపీ, నెట్ బ్యాంకింగ్, యూపీఐలను ఎట్టి పరిస్థితుల్లోనూ వేరే సైట్‌లో ఎంటర్ చేయకూడదు. తెలియని క్యూఆర్ కోడ్లు స్కాన్ చేయకూడదు, క్రెడిట్ కార్డులో నగదు పెంచేందుకు గడువు ఒక్కరోజే ఉంది, ఓటీపీ చెబితే వెంటనే అప్డేట్ చేస్తామని చెబుతారు.. బ్యాంకుల నుంచి అటువంటి ఫోన్‌కాల్స్ రావనే విషయాన్ని గుర్తించాలి. మీకు ఆన్‌లైన్‌లో కొన్న వస్తువుకు గిఫ్ట్ వచ్చింది, అడ్రస్ చెబితే ఇంటికి పంపిస్తామని ఫేక్ కాల్ సెంటర్ నుంచి ఫోన్ వచ్చిన క్రమంలో చిరునామా, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. సైబర్ నేరాలకు గురైన వారు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి. లేదంటే https://www.cybercrime.gov.inకి ఫిర్యాదు చేయాలి. మీ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరం జరిగిన గంటలోపు స్పందిస్తే.. బ్యాంకులు నగదు చోరీని నిలువరించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112కు సమాచారాన్ని అందించాలి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నిత్యం సామాజిక మాధ్యమాల్లో జరిగే నేరాలను చూస్తూనే ఉన్నాం. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. అనవసరమైన లింక్‌లు తెలియకుండా క్లిక్ చేస్తే.. ఇబ్బందులు తప్పవన్న విషయాన్ని గుర్తించాలి. సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930కి ఫిర్యాదు చేయాలి.

– ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

- నలుగురికి తీవ్రగాయాలు
- నిలిచిన వాహనాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తూ ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఆటోడ్రైవర్ మృతిచెందగా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ వెళుతూ ఫిరంగిపురం గ్రామశివారులోని గోకుల్ టీసెంటర్ సమీపంలో గుంటూరు నుండి నరసరావుపేట వెళుతున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోడ్రైవర్ జి.మనోజ్‌కుమార్ (25) అక్కడిక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో నలుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలం నుంచి రహదారి కిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న సీఐ రవీంద్రబాబు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సంఘటనా స్థలంలోని ఆటో వద్ద మృతుడు మనోజ్‌కుమార్, వాహనాలు

క్లుప్తంగా

కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలన



అచ్చంపేట: మండల సరిహద్దులోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులను పెదకూరపాడు, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రీరాంతాతయ్యలు సోమవారం సాయంత్రం పరిశీలించారు. ప్రాజెక్టు ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమావేశమై నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు.

పద్మశాలి యువసేన సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం

పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లారావు



సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతోమందికి ఆదర్శప్రాయమని పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్గం పుల్లారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుల్లారావు మాట్లాడుతూ యువసేన సేవా కార్యక్రమాలను పద్మశాలి సమాజం గమనిస్తోందనీ, ఇలాగే సేవాభావంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రత్యేకించి పల్నాడు జిల్లాలో సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న యువసేన రాష్ట్ర ప్రతినిధి గోలి వంశీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం కన్వీనర్ జి.వి.నాగేశ్వరరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, సంఘం మాజీ అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు, సంఘం కో కన్వీనర్ మునగపాటి శ్రీనివాసరావు, సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి చిలుకోటి అంజిబాబు, యువసేన రాష్ట్ర ప్రతినిధి గోలి వంశీకృష్ణ మాట్లాడారు. ఇంటర్ చదువుతున్న పద్మశాలి విద్యార్థిని కొత్రపు హేమలతకు యువసేన ఆధ్వర్యంలో సేకరించిన రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యువసేన రాష్ట్ర ప్రతినిధులు పెనుగొండ శ్రీనివాసరావు (తూర్పుగోదావరి జిల్లా), మునగపాటి రమేష్ (నెల్లూరు జిల్లా), బొడ్డు శ్రీనివాస్ (కాకినాడ జిల్లా), కప్పల లక్ష్మణరావు (విజయనగరం జిల్లా), స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కళలు కావు.. చైతన్య దివిటీలు

- ముగింపు రోజు సందేశాలను అందించిన మూడు నాటికలు
- ఆద్యంతం హాస్యపు జల్లులు కురిపించిన 'బావా ఎప్పుడు వచ్చితీవు' నాటిక

యడ్లపాడు: కొండవీటి కళాపరిషత్ 26వ జాతీయ స్థాయి నాటికల పోటీలు లింగారావుపాలెంలో సోమవారం రసవత్తరంగా కొనసాగాయి. ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షులు గుదె పాండు రంగారావు జ్యోతి ప్రదీపనం చేయగా, గ్రామపంచాయతీ సర్పంచ్ షేక్ కరీమూన్ నటరాజపూజతో మూడో రోజు పోటీలను ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు, ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, నంబూరు వీరాంజనేయులు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మల్నేని సీతారామాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు, కోశాధికారులు కట్టా వీరాంజనేయులు, నంబూరు శివరామకృష్ణ, నంబూరు ఉల్లయ్య, జరుగుల రామారావు, ఆలోకం పెద్దబ్బయ్య, మోహనరావు ఉన్నారు. అనంతరం పోసాని సుబ్బారావు చౌదరి స్మారక వేదికపై 'కరుణారసకవి భవభూతి' కళాప్రాంగణాన చివరి ప్రదర్శనలు జరిగాయి.



మూడో రోజు నాటిక పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



బావా ఎప్పుడు వచ్చితీవు నాటికలో ఓ సన్నివేశం

పిలుపు కాదు.. మనసే బంధమని చెప్పే 'బావ ఎప్పుడు వచ్చితీవు' నాటిక

పిలుపు మాటల్లో కాదు, అనుబంధం మనసులో ఉండాలన్న సత్యాన్ని వినోదంతో పాటు విలువలతో చెప్పిన సందేశాత్మక కళారూపమే 'బావ ఎప్పుడు వచ్చితీవు' నాటిక. సుబ్బలక్ష్మి భర్త స్నేహితుడిని పేరుతో పిలవడాన్ని వ్యక్తిగతంగా తీసుకున్న సుబ్బారావు, తన భార్యను ఒక నియమంలో కట్టేస్తాడు. ఇంటికి వచ్చే ప్రతి ఒక్కరినీ అన్నయ్య అని, ఆ తర్వాత బావ అంటూ పిలవాని ఆదేశిస్తాడు. ఇది వినోదానికి దారితీస్తూ, సామాజిక విమర్శకంగా మారి, ప్రేక్షకుడికి నవ్వులు పంచుతూనే, పురుషాధిపత్యాన్ని హాస్యచలోక్తులతో ఎండగిస్తాయి. చివరికి సుబ్బారావు తన వైఖరిని మార్చుకొని, స్త్రీల గొప్పతనాన్ని త్రిమూర్తులతో పోల్చడం, సమానత్వాన్ని చాటడం అత్యంత ప్రభావవంతంగా ముగుస్తుంది. ఇది 50వ ప్రదర్శన కావడం ప్రత్యేకం. ఈ నాటికను మానవతా(యడ్లపాడు) వారు ప్రదర్శించారు. స్వర్గీయ పీవీ భవాని ప్రసాద్ రచించగా, సినీ దర్శకులు జరుగుల రామారావు దర్శకత్వం వహించారు. ఆద్యాంతం కడుపుబ్బ నవ్విస్తూ, ఆహుతుల్ని ఎంతో ఆకట్టుకుంది.

టెక్నాలజీ నుంచి మనిషితనానికి నిష్క్రమణే 'నా శత్రువు' నాటిక

టెక్నాలజీ మిత్రుడు కావచ్చు, కానీ మనం దానికి బానిసలైతే అది మానవ సంబంధాలను చంపే శత్రువుగా మారుతుందని గొప్ప సందేశం ఇచ్చే 'నా శతృవు' నాటిక. వాట్సాప్ ఉంది, కానీ వెచ్చని పలకరింపు లేదు. ఇంస్టా ఫాలోవర్స్ వందలు ఉన్నా, దగ్గరగా నడిచేవాళ్లు లేరు. టెక్నాలజీని జీవితం చేసి, మనుషుల్ని ఉపేక్షించినప్పుడు.. మనశ్శాంతి మ్యూట్ అయిపోతుంది. అవసరానికి వాడాల్సిన టెక్నాలజీ, అవసరం లేనప్పుడూ వాడితే? అది మిత్రుడు కాదని, మానవత్వాన్ని కరిగించే శత్రువని ఈ నాటకం ఘాటుగా చెబుతుంది. కానీ మనిషితనాన్ని మర్చిపోకూడదని ఆలోచింప జేసే నాటిక ఇది. సునయన నిర్వహణలో యువభేరి థియేటర్స్ (హైదరాబాద్) వారు ప్రదర్శించిన ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రాయగా, వడ్డాది సత్యానారాయణ దర్శకత్వం వహించారు.

ప్రతి సమస్యకు పరిష్కారం అదేనా... 'విడాకులు కావాలి' నాటిక

దాంపత్యంలో అభిప్రాయ భేదాలు, అపోహలు సహజమే.. అవి సమస్యలుగా మారకుండా చేస్తే బంధం బలపడుతుందని సున్నితంగా తెలిపే నాటికయే 'విడాకులు కావాలి'. చిన్న చిన్న విభేదాలకు అహంకారంతో పట్టుదలకు పోయి విడాకులే పరిష్కారం అని దంపతులు భావించరాదని, జీవిత భాగస్వామ్యాన్ని అర్థం చేసుకుని, పని విభజన, పరస్పర సహకారంతో దాంపత్య జీవితాన్ని సమతుల్యం చేసుకోవచ్చని సంఘటన ద్వారా కనువిప్పు కలిగిస్తాయి.

సర్దుబాటు ధోరణి, సంయమనం ఆదర్శ దంపతులుగా మార్చి, భారతీయ సంస్కృతి– సాంప్రదాయాలే బంధాలను బలోపేతం చేస్తూ దాంపత్యాన్ని ఆనందమయంగా మారుస్తాయని చాటిచెప్పిన కళారూపమిది. అరవింద ఆర్ట్స్ (తాడేపల్లి) వారు ప్రదర్శించిన ఈ నాటికను వల్లూరి శివప్రసాద్ రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.

అందరికీ సమానత్వం అంబేడ్కర్‌తోనే సాధ్యమైంది



నరసరావుపేట: రాజ్యాంగంలో అందరికీ సమానత్వం కల్పించిన మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ అని ఎస్పీ కంచి శ్రీనివాసరావు కొనియాడారు. భారతరత్న అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రపంచ దేశాలలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం రచించి ఆయన దేశానికి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, సమానత్వం, మానవ హక్కులు, విద్యా స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన కృషి అనిర్వచనీయమైందని ఎస్పీ అన్నారు. . ఆయన చూపిన సమానత్వం, న్యాయం, సౌభ్రాతత్వం వంటి రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, పోలీస్ సిబ్బంది అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యోగ నిర్వహణ చేయాలని సూచించారు. అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, అడ్మిన్ ఆర్.ఐ రాజా, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జానపాడులో రైల్వే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించాలి

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ. 50 కోట్ల నిధులు మంజూరు
- రోడ్డు విస్తరణ, విద్యుత్ స్తంభాల తొలగింపు, కాంట్రాక్ట్ వంటి పనులు పూర్తి
- కూటమి ప్రభుత్వంలో అసలు పనులు చేపట్టడం లేదు
- స్పందించకుంటే నిరసన వ్యక్తం చేస్తాం
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హెచ్చరిక

పిడుగురాళ్ల: జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, లేని పక్షంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేస్తామని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ ఇచ్చిన జానపాడు గ్రామం రుణం తీర్చుకునేందుకు సుమారు రూ. 50 కోట్లతో బ్రిడ్జి మంజూరు చేయించటం జరిగిందన్నారు. దీని ద్వారా జానపాడు గ్రామం ఒక పట్టణంగా తయారవుతుందని ప్రజలకు వాణిజ్య సదుపాయాలు వచ్చి ఆర్థిక వెసులబాటు వస్తుందన్నారు. స్కూల్స్, కాలేజీలు, వ్యాపార సముదాయాలు వస్తాయని, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఉండటం వలనే ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని, ఇలాంటివి వస్తే మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రపోజల్ వెళుతుండగా 27 నెంబర్‌లో ఉన్న ఈ బ్రిడ్జిని కృష్ణబాబుతో మాట్లాడి 5, 6 బ్రిడ్జిలకు తీసుకు వచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆరేడు బ్రిడ్జిలు మంజూరు చేస్తే అందులో ఈ బ్రిడ్జి కూడా రూ. 50 కోట్లు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరాయించేలా తీసుకొని వచ్చామని ఆయన తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు, విద్యుత్ స్తంభాల తొలగింపు, కాంట్రాక్ట్ కేటాయింపు వంటి పనులు పూర్తి చేశామని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక అంగుళం కూడా ఆ పనులు చేయటం లేదని బహుశా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉండి ఉంటే 70–80 శాతం పనులు పూర్తి చేసే వాళ్లమని ఆయన తెలియజేశారు. బైపాస్ ఒక లైన్ పనులు ఎలా పూర్తి చేశామో అదేవిధంగా ఈ రైల్వే బ్రిడ్జిని కూడా పూర్తి చేసేవాళ్లమని ఆయన పేర్కొన్నారు.

వెంటనే కలెక్టర్‌తో దీనిపై సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే బాధ్యతగా పనులు చేయాలని ప్రభుత్వాలు మారినంత మాత్రన అభివృద్ధి ఆగకూడదని, ఆ రోజు మేము నాటిన విత్తనానికి నీళ్లు పోయమని కోరుతున్నామని, అది రేపు వృక్షంగా మారి ఫలాలు అందిస్తుందని తెలియజేశారు. జానపాడు రైల్వే బ్రిడ్జి పనులు మూడు, నాలుగు నెలలలో ప్రారంభించకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తామని, అంతేకాకుండా జానపాడు, పిడుగురాళ్ల పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమాలు కూడా చేస్తారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, కౌన్సిలర్లు అబ్దుల్లా, కొక్కెర శ్రీను, సైదావలి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు



సమావేశంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర నాయకులు

నరసరావుపేట: ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం అనునిత్యం శ్రమించడమే సీపీఎం ప్రధాన అజెండాగా ఉంటుందని, దేశ వ్యాప్తంగా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ప్రజలలో చైతన్య నింపి పోరాటాలకు సిద్ధం చేయడమే ప్రధాన కర్తవ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు అన్నారు. స్థానిక కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సోమవారం పార్టీ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పీ–4 పేరిట పేదరిక నిర్మూలన చేస్తామని బడా కంపెనీలు, కోటీశ్వరులు ముందుకు వస్తే పేదరిక నిర్మూలన సాధ్యమని బూటకపు కబుర్లు చెబుతున్నారన్నారు. దానధర్మాలు చేయడాన్ని తాము తప్పు పట్టడం లేదని, పేదలపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే పేదరిక నిర్మూలన తన బాధ్యతగా భావించాలన్నారు. దానధర్మాలు దయా దాక్షిణ్యాలతో కాదని, సంక్షేమ పథకాలు ప్రజల హక్కు అన్నారు. సూపర్ సిక్స్ పేరిట హామీలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ సంపదను సంక్షేమ పథకాల రూపంలో కేటాయించాల్సి ఉండగా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వంచించడం సరికాదన్నారు. నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు లేక అసంఘటిత రంగ కార్మికులు అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి రాజకీయ వేధింపులు నివారించాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలకు ఆదాయాలు చూపించి పేదరిక నిర్మూలన చేయాలన్నారు. రైతులు, కౌలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఇవన్నీ వదిలేసి పీ–4 అంటూ బూటకపు కబుర్లు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీలు, కార్పొరేట్ కంపెనీలకు భూములను దారాదత్తం చేయకుండా భూమిలేని దళితులకు, పేదలకు కేటాయించాలన్నారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ అక్షరాస్యత పరంగా వెనుకబడిన పల్నాడు జిల్లాలో నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రతి మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పల్నాడు జిల్లాకు పరిహారమైన వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా ఒక లక్ష ఎకరాలకు సాగునీరు, 100 గ్రామాలకు తాగునీరు అంది పల్నాడు సస్యశ్యామలం అవుతుందన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, ఎస్.ఆంజనేయులు నాయక్, ఏపూరి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మద్దిరాల వాసి మృతి



చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన షేక్ అబ్దుల్లా(44) ఏడేళ్ల కిందట పట్టణంలోని మద్దినగర్‌కు చెందిన షేక్ అప్సాను రెండో వివాహం చేసుకుని మండలంలోని మద్దిరాల గ్రామంలో ఓ కిరాణ షాపును ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం బంధువుల ఇంట్లో ఓ శుభాకార్యానికి తన కుమారుడు మొహమ్మద్ అబ్రన్‌తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. కొద్ది సేపటికే గ్రామంలోని నవోదయ విద్యాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో అబ్దుల్లాకు తలకు తీవ్రగాయాలు కాగా, బైక్‌పై వెనుక కూర్చున్న కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చిలకలూరిపేట పట్టణంలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సోషలిస్ట్ నేత మోదుగుల పాపిరెడ్డికి ఘన నివాళి

- దశ దిన కర్మకు హాజరైన ప్రముఖులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ



పాపిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గుంటూరు రూరల్: సోషలిస్ట్ పార్టీ నేత మోదుగుల పాపిరెడ్డి(88) దశదిన కర్మకు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. సోమవారం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని రెడ్డిపాలెం వద్ద ఉన్న ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి నివాసంలో పాపిరెడ్డి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మోదుగుల కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. పాపిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ప్రగాడ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మర్రి రాజశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, వైఎస్సార్ సీపీ పొన్నూరు, ప్రత్తిపాడు, వేమూరు, సత్తెనపల్లి, మంగళగిరి సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్‌కుమార్, వరికూటి అశోక్‌కుమార్, గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, దొంతిరెడ్డి వేమారెడ్డి, కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబులతో పాటు భాష్యం రామకృష్ణ, నన్నపనేని రాజకుమారి, కోవెలమూడి రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీలు జేడీ శీలం, వై.శివాజి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

బాబి క్రికెట్ లీగ్‌లో సత్తా చూపిన సత్తెనపల్లి జట్టు

- 45 రోజులుగా జరుగుతున్న పోటీలు
- వేర్వేరు ప్రాంతాల నుంచి 18 జట్ల రాక



ప్రథమ స్థానం సాధించిన సత్తెనపల్లి జట్టుకు కప్పు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: బాబి క్రికెట్ లీగ్ రాష్ట్రస్థాయి పోటీల విజేతగా సత్తెనపల్లి నిలిచింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత 45 రోజులుగా జరుగుతున్న బాబి క్రికెట్ లీగ్ రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 18 జట్లు పోటీపడ్డాయి. సోమవారం పోటీలు ముగియడంతో శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. పోటీల్లో ద్వితీయ స్థానం నెల్లూరు, తృతీయ స్థానం వేటపాలెం దక్కించుకున్నాయి. ప్రథమ స్థానం సాధించిన సత్తెనపల్లి జట్టుకు రూ. 1,11,111, ద్వితీయ స్థానం సాధించిన నెల్లూరు జట్టుకు రూ. 77,777, తృతీయ స్థానం సాధించిన వేటపాలెం జట్టుకు రూ. 55,555 నగదు బహుమతులను స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందించారు. సభకు ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ అధ్యక్షత వహించారు. బాబీ చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో నైపుణ్యం సాధించి విజేతలుగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్ల క్రీడా కారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి.నాగేశ్వరరావు, క్రీడాకారుడు ముదినేడి సుబ్బయ్య, క్రీడాకారులు, తదితరులు ఉన్నారు.